ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబర్ 2022 5
అనంతపురం





ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న రైతు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు

ప్రతి మొబైల్‌లోనూ దిశాయాప్

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేరాల నియంత్రణ, పోలీసుల సహకారం కోరేందుకు జిల్లాలోని ప్రతి మహిళ తన మొబైల్‌లో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో చట్ట పరంగా మహిళలకు ఉన్న రక్షణలు, మహిళలపై జరుగుతున్న హింసపై అవాగహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వారికి ఎదురయ్యే ప్రమాదాలు, హక్కులపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదంలో ఉన్నప్పుడు హెల్ప్ లైన్ నెంబర్లకు డయల్ చేయాలన్నారు. దిశ యాప్‌లో ఎస్ఒఎస్ బటన్ నొక్కాలి అనే చిన్నచిన్న విషయాలు తెలిసి ఉండటం కూడా ఒక మహిళ జీవితంపై ఎంతో సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలు, డ్వాక్రా సంఘాలను లక్ష్యం చేసుకుని లింగ వివక్ష, మహిళలపై హింస, చట్టాల్లో రక్షణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రిదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, గహ హింసపై న్యాయ సలహాదారులు నర్మద పాల్గొన్నారు.

ఫిర్యాదుదారునితో ఫొటో తప్పనిసరి

స్పందన అర్జీల పరిష్కారంలో ఫిర్యాదుదారునితో ఉన్న ఫొటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు అధికారులు ఫోటో అప్‌లోడ్ ఆప్షన్ స్థానంలో అర్జీలకు ఇచ్చే సమాధానాల కాపీలను అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఇది సరికాదని విచారణ సందర్భంగా ఫిర్యాదుదారునితో తీసుకున్న ఫొటోను ఆప్‌లోడ్ చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులలో పురోగతి చూపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లాకు మంజూరైన రూ.33 కోట్ల రూపాయల పనులకు ఖర్చు వివరాలు ఆన్‌లైన్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఉరవకొండ, వజ్ర కరూర్ లలో మంజూరైన పనులకు ఏజెన్సీల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మెజారిటీ పనులు చేపడుతున్న పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు త్వరగా ఏజెన్సీలను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రిదేవి, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

కర్నూలు జిల్లాలో జరిగిన రాయలసీమ గర్జనలో ప్రసంగిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



జాడలేని సమగ్రాభివృద్ధి

◆ సాగునీటి పథకాలపై చిత్తశుద్ధి కరువు

◆ పరిశ్రమల ఏర్పాటు మాటలకే పరిమితం

◆ ప్రణాళిక లేని గర్జనపై విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయలసీమ వెనుకబాటుతనంపై ఇప్పుడు పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గర్జన పేరుతో అధికారపార్టీ కర్నూలు చేపట్టిన సభతో ఇక్కడి అభివృద్ధిపైనా చర్చ జరుగుతోంది. అత్యంత వెనుకబడిన ప్రాంతాభివృద్ధిపై అనేక ఏళ్లుగా ఇదే రకమైన చర్చలు సాగుతూనే ఉన్నాయి. సాగునీరు, పరిశ్రమల ఏర్పాటు జరగాలని అనేక ఉద్యమాలు సైతం నడిచాయి. అయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 27 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో రెండు లక్షల ఎకరాల్లోపే నీటి వసతి ఉంటోంది. పది శాతంలోపే నీటి వసతి ఉంది. జిల్లా సాగు, పారిశ్రామిక అవసరాలు అన్నీ తీరాలంటే కనీసం 120 టిఎంసిల వరకైనా నీటి సౌకర్యం ఉండాలని సాగునీటి నిపుణులు సైతం అంచనా వేశారు. దీనికోసమే హంద్రీనీవా ప్రాజెక్టును మరింత విస్తరించాలని డిమాండ్ వస్తోంది. అదే సమయంలో అంతకు ముందున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద 42 టిఎంసిలు తీసుకోవాల్సిన చోట 25 టిఎంసిల నుంచి గరిష్టంగా 30 టిఎంసిల్లోపే తీసుకోగలుగుతున్నాం. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులను పూర్తిగా రద్దు చేసింది. దీంతో ఏటా నిర్వహణే గగనంగా మారుతోందని జలవనరుల శాఖ అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయినా నిధుల కేటాయింపులు జరగలేదు. హంద్రీనీవా ద్వారా 30 టిఎంసిల వరకు తీసుకోగలుగుతున్నా, దీన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ప్రభుత్వమూ ఆరు వేల క్యూసెక్కులకు ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతామని ప్రకటించింది. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభమవలేదు. ప్రధాన ప్రాజెక్టులు పూర్తయ్యి అదనంగా నీరు రాకుండా ఈప్రాంతాభివృద్ధి ఎలా సాధ్యమన్న ప్రశ్న జిల్లావాసుల నుంచి వ్యక్తమవుతోంది.

పడకేసిన పారిశ్రామికాభివృద్ధి

జిల్లా అభివృద్ధి కోసం పారిశ్రామికంగా అనేక హామీలను ప్రభుత్వాలిచ్చాయి. గడిచిన ఐదారు దశాబ్దాల్లో వచ్చిన ఒకేఒక పెద్ద పరిశ్రమ కియా కార్ల తయారీ పరిశ్రమ. అది మినహా కొత్తగా ఒక్క పరిశ్రమరాలేదు. వస్తుందనుకున్న జాకీ పరిశ్రమ నాయకుల బెదిరింపులతో అడుగుమోపకుండానే వెనుదిరిగిపోయింది. ఇప్పుడు ఆ పాపం ఒకరిపై ఒకరు నెట్టుకునే ప్రయత్నాలను అధికార, ప్రతిపక్షాలు చేస్తున్నాయి. తెరిపిస్తామని హామీనిచ్చిన్న గుంతకల్లు స్పిన్నింగు మిల్లు గేటు ద్వారాలు సైతం తెరచుకోలేదు. ఇక బంగారు గనులు తిరిగి ప్రారంభిస్తామని ఇప్పటికీ రోజుకొక ప్రకటన వెలువడుతూనే ఉంది. కాని ఆచరణకు నోచుకోవడం లేదు. విభజన సమయంలో ఇచ్చిన కుదురేముఖ ఉక్కు కర్మాగారం ఊసే లేకుండాపోయింది. మూడు ప్రభుత్వరంగ సంస్థలు కలిపి ఏర్పాటు చేయబోయే ఈ కర్మాగారంతో రాయదర్గం ప్రాంతంలో ప్రత్యక్షంగా మూడు వేల మందికి ఉపాది లభించి ఉండేది. కాని అధికార, ప్రతిపక్షాలేవి ఈ ప్రాజెక్టుపై పెదవి విప్పడం లేదు. సాగునీరు, పరిశ్రమలు అదనంగా రాకుండా రాయలసీమలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన అనంతపురం జిల్లా అభివృద్ధి ఏ మేరకు సాధ్యమన్న ప్రశ్నలు ఈ ప్రాంత మేధావుల నుంచి కూడా వ్యక్తమవుతున్నాయి. వీటికి అవసరమైన ప్రణాళికలను కూడా ప్రభుత్వం చేసిన దాఖలాల్లేవన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

పత్తి రైతులను ఆదుకోండి

◆ కల్తీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారు..

◆ కలెక్టరేట్ ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

◆ పత్తి మొక్కలతో రైతుల ర్యాలీ, ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పత్తి రైతుల సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

కల్తీ, నాసిరకం పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పతి రైతులను ఆదుకోవాలని, నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు రైతులు, వారి కుటుంబ సభ్యులు, రైతు సంఘం నాయకులు పత్తి పువ్వులు, కాయలు కాయని పత్తి మొక్కలను చేతపట్టుకుని ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం.బాషా, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 70 వేల హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేశారని తెలిపారు. పత్తి విత్తన కంపెనీలు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని నాసిరకం నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను నిలవుదోపిడీ చేసశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఇతర ప్రాంతాల నుంచి అనేక రకాల నాసిరకం వ్తినాలు పెద్ద ఎత్తున రైతులకు విక్రయించారన్నారు. రైతులు రూ.350 కోట్ల పెట్టుబడుల రూపంలో నష్టపోయారన్నారు. అధికారుల ప్రమేయంతోనే నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాసిరకం పత్తి విత్తనాల వల్ల పామిడి, పెద్దవడుగూరు, తాడిపత్రి తదితర ప్రాంతాల రైతులు నష్టపోయారన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తామన్న ప్రభుత్వం మాట నిలపుకోలేదన్నారు. వీటన్నింటి ఫలితంగా రైతులు మోసపోయి, పెట్టుబడులు నష్టపోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. నాసిరకం విత్తనాలతో తాడిపత్రి మండలంలోని కోనగుట్టపల్లి, దిగువపల్లి, ఎగువపల్లి, బందర్లపల్లి, బాపణపల్లి, తిమ్మేపల్లి, తిమ్మాపురం, తేరన్నపల్లి, పెద్దపడమల గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాలకుపైగా పత్తి పంట నష్టం జరిగిందన్నారు. నాసిరకం పత్తి విత్తనాలు దిశా, తులసి, అఖిర, అంకుర ఎటిఎం, లక్ష్మీగోల్డ్, నవ్య, యుఎస్ కంపెనీ విత్తనాలు ఆధోని, గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో ఉన్న ఫర్టిలైజర్స్ షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసి, అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం ఎకరాకు ఒక క్వింటా కూడా దిగుబడి రాలేదన్నారు. పామిడి మండలం, గజరాంపల్లి, తంబల్లపల్లి గ్రామాల్లో 1800 ఎకరాలకుపైగా పంట సాగు చేసి నష్టపోయారన్నారు. కావున అకిర, తడాఖ కంపెనీ యజమానులు, ఫర్టిలైజర్ షాపు యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ పూర్తి స్థాయి పరిశీలించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజారెడ్డి, విరూపాక్షి, రాయుడు, సిఐటియు జిల్లా నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఒకే రోజు ఇద్దరు రైతుల ఆత్మహత్య

అనంతపురం జిల్లాలో రైతుల ఆత్మహత్యల పరంపరం కొనసాగుతోంది. అప్పల బాధలు తాళలేక ఆదివారం నాడు ఓ పత్తి రైతు ఆత్మహత్య మరువక ముందే సోమవారం నాడు ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. విడపనకల్లులో ఒక రైతు, గుత్తిలో ఓ రైతు సోమవారం నాడు ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలో వరుసగా జరుగుతున్న అన్నదాతల బలవన్మరణాలు వారి కన్నీటి కష్టాలకు అద్దం పడుతున్నాయి.





ఆత్మహత్య చేసుకున్న రైతులు చెన్నప్ప, చింతల శీనా

వార్త మెయిన్‌లో..

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తే పెద్దఎత్తున ఉద్యమం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పదేళ్లలోపు సర్వీసు ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని గుట్టుచప్పుడు కాకుండా ఆదేశాలను జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఈమేరకు నవంబర్ 28న ప్రభుత్వం అన్నిశాఖలకు ఉత్తర్వులు పంపినట్లు అన్ని స్థాయి ఉద్యోగుల్లో గందరగోళం భయాందోళనలు నెలకొంటున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పదేళ్లలోపు సర్వీస్ ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 2.40 లక్షల మంది, జిల్లాలో 1500 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ఇలాంటి ఆదేశాలతో ఉద్యోగుల అభద్రతాభావం నెలకొందన్నారు. ప్రభుత్వ ఆదేశాల అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఈ విధంగా నిర్ణయాలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఏనాటికైన తమ ఉద్యోగాలు రెగ్యులరైజేషన్ చేస్తారనే ఆశతో తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని, అలాంటిది వారిని పూర్తిగా తొలగించే సాహసం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇలాంటి ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలో నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, నాయకులు నాగభూషణం, గురురాజా తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టౌన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, పాలకవర్గం సభ్యులు

కలెక్టర్‌ను కలిసిన అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన జె.ఎల్.మురళీధర్, పాలకవర్గ సభ్యులు సోమవారం సాయంత్రం కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతపురం అర్బన్ బ్యాంకు ఎన్నికలతోపాటు కౌంటింగ్ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మీ సహకారంతో అర్బన్ బ్యాంకు అభివృద్ధికి తమ పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కృష్ణకుమార్, టిడిపి నాయకులు రాయల్ మురళీ, బ్యాంకు డైరెక్టర్లు రామాంజినేయులు, సుంకర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

వ్యకాసం ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-శింగనమల

ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో ఈనెల 8, 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. ఈమేరకు మండల కేంద్రంలో సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు ఆల్ ఇండియా నాయకుల బృందాకరత్, ఆలిండియా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, విజయరాఘవన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా కూలి ఇవ్వాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సంవత్సరంలో 200 రోజులు పనిదినాలు కల్పిస్తూ రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, వ్యవసాయంపై ఆధారపడిన జీవిస్తున్న భూమిలేని కుటుంబాలకు భూమి ఒక్కొక్క కుటుంబానికి ఐదెకరాలు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుంకన్న, అధ్యక్షులు, కుళ్లాయప్ప, నాగరాజు, రామాంజనేయులు, నవీన్, శాంతి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : ఏలూగు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈనెల 8, 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో వేరుశెనగ కలుపు కూలీలతో కలిసి మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ ఈ సభలకు ఆల్ ఇండియా నాయకులు బృందాకరత్, ఆల్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్, విజయ రాఘవన్ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, సాకే నాగరాజు, తిమ్మప్ప, రామునాయక్ తదితరులు ఉన్నారు.



శింగనమల పోస్టర్లు విడుదల చేస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

యుటిఎఫ్ పోరాటం విజయవంతం

ఎస్ఎస్ఎ సెక్టోరియల్ పోస్టుల ఇంటర్వ్యూలు వాయిదా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఎస్ఎలోని సెక్టోరియల్ పోస్టుల నియామకాల్లో జరుగుతున్న అవకతవకలపై యుటిఎఫ్ చేసిన పోరాటం ఫలించింది. సెక్టోరియల్ నియామకాల్లో సవరణ చేయాలని, నిబంధనలు పాటించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ బసంత్‌కుమార్ స్పందించి సోమవారం యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్రను పిలిపించుకుని మాట్లాడారు. సెక్టోరియల్ నియామకాల్లో కొన్ని పొరపాట్లు జరిగాయని వివరించారు. కేటగిరి వారీగా విభజించి పాయింట్లు కేటాయించాలన్నారు. అన్నిపోస్టులకు సంబంధిత జిల్లా వారినే నియమించాలన్నారు. దరఖాస్తు చేయని పోస్టులకు ఇంటర్వ్యూలకు పిలవడం ఆక్షేపనీయమని వివరించారు. దరఖాస్తు చేసిన వాటికి సర్టిఫికెట్లు, ఎస్ఆర్ వెరిఫికేషన్ జరాగాల్సి ఉందన్నారు. పారదర్శకంగా నియామకాలు జరాగాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ పూర్తిగా పరిశీలన చేసిన తరువాతనే పోస్టులు భర్తీ చేస్తామని అంత వరకు వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనేకలెక్టర్ స్పందించడంపై యుటిఎఫ్ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.

బాడుగుల భారం.. కాడెద్దులుగా మారిన వైనం..!



స్నేహితుడితో కలిసి దెంత గుంటకలు పొస్తున్న రైతు జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

సాగులో బాడుగల భారం భరించలేక స్వయానా రైతులే కాడెద్దులుగా మారిన వైనం మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు జయచంద్రారెడ్డి తనకున్న నాలుగెకరాల పొలంలో ధనియాల పంట సాగు చేశాడు. జయచంద్రారెడ్డి కొన్నేళ్లుగా వివిధ రకాల పంటలుసాగు చేసి నష్టాలు ఊబిలో కూలిపోయాడు. అయితే ఈసారి సకాలంలో వర్షాలు కురవడంతో తనకున్న నాలుగెకరాల పొలంలో ధనియాల పంట సాగు చేశాడు. అయితే పొలంలో కలుపు తీసేందుకు ఎద్దులు, ట్రాక్టర్లకు బాడుగలు ఎక్కువ కావడంతో తన మిత్రుడు వెంకటేశులుతో కలిసి కాడెద్దులుగా మారి దెంత గుంటకలు పాశారు. ఈ విషయంపై రైతుతో మాట్లాడగా ప్రస్తుతం ఉన్న పరిస్థితులో బాడుగలు విపరీంగా పెరిగాయన్నారు. దీంతో బాడుగలు భరించలేక తన స్నేహితుడితో కలిసి తానే గుంటకలు దున్నుకున్నట్లు తెలిపాడు.


ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా హనుమద్ వ్రతం

గుంతకల్లు రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం హనుమద్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తర్వాత కళ్యాణ మండపంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేద పండితుల వేద మంత్రోచ్చరణతో గంధ, పుష్ప, వివిధ పరిమళ ద్రవ్యాలు, పళ్లరసాలతో ఉత్సవమూర్తిని అభిషేకించారు. సింధూరం గంధంతో అభిషేకించిన తర్వాత ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రధాన అర్చకులు స్వామి వారి వ్రత మహత్యం కథలు వినిపించి అఖండ హారతులు ఇచ్చారు. తర్వాత మాలధారులు, భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగంగావించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, ఆలయ ఈవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎఇఒ ధనుంజయ, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, సూపరింటెండెంట్ రామ్మోహన్, ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విడపనకల్ మండలాధ్యక్షుడిగా తిప్పయ్య

ఉరవకొండ : విడపనకల్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని హావలిగి గ్రామానికి చెందిన డి.తిప్పయ్యను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి కె.ఎర్రిస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా వేల్పుమడుగు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులుగా గురు ప్రసాద్, గౌరవ సలహాదారులుగా ఎం.ఓబులేసు, కార్యవర్గ సభ్యులుగా శంకరయ్య, నెట్టికల్లు, ఉలిగయ్య, నాగేంద్రను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీల ద్వారా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఎస్సీలను చైతన్య పరుస్తామన్నారు.

ఘనంగా హనుమాన్ రథోత్సవం



బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్ గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఆంజనేయ స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వేదమంత్రాలతో వెండి కవచం, సువర్ణ కిరీటం, తమలపాకలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. తర్వాత స్వామివారిని చిన్న రథంపై ఆసీనులు చేసి ఊరేగించినట్లు ఆలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. స్వామి దర్శనం వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేసినట్లు ఆలయ అన్నదాన కమిటీ ఆంజనేయులు తెలిపారు.

ప్రజా సేవకుడు విజయ్

నార్పల : సంఘ సేవకుడు సామాజిక కార్యకర్త కొమ్మిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి అని నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు, జిల్లా నాయకులు అలం వెంకట నరసానాయుడు కొనియాడారు. సోమవారం మండల పరిధిలోని దుగుమర్రి గ్రామంలో విజయ భాస్కర్‌రెడ్డి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ స్నేహితులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆస్మా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీన కళ్యాణదుర్గంలో నిర్వహించిని టెన్నికాయిట్ పోటీల్లో పుట్లూరు ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు మానస, ఎస్తేరి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పిఇటి పవన్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

In the court of the Hon'ble M.A.C. Tribunal (Before the Addl. District Judge Cum- Family Court Judge, Ananthapuramu
M.V.O.P. No: 84/2022

Between:
Jerripati Bavanna ...petitioner
And
M.Raja Reddy & 2 others ...Respondents

Notice to Respondent No:1

R1: M.Raja Reddy S/o Ramachandra Reddy R/o Malakavari Palli (V), Amadaguru (M), Ananthapuramu Dist.

ఇందుమూలముగా తెలియజేడము ఏమనగా ప్రతివాది Respondent No.1 హాజరు నిమిత్తం పై కోర్టు నందు 12-12-2022 వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10-30 గం॥లకు స్వతహాగా గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
కె.సుగునాకర్ బాబు, జె.శ్రీనివాసులు,
Advocates, Anantapuramu,

ఉపాధ్యాయులకు ప్లేస్‌మెంట్ ఇచ్చాకే సర్దుబాటు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులకు పదోన్నతలు కల్పించి, బదిలీల్లో ప్లేస్‌మెంట్ ఇచ్చిన తర్వాతనే పని విభజన చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. సోమవారం డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సర కాలంగా ప్రభుత్వం 30 వేల ప్రమోషన్లు ఉపాధ్యాయులకు కల్పిస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు చివరకు అష్టకష్టాలు పడి 4 వేల ప్రమోషన్లు ఇచ్చారన్నారు. బదిలీల్లో ప్లేస్‌మెంట్ ఇస్తామని చెప్పి వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సరికాదన్నారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి సబ్జెక్టు ఉపాధ్యాయులతో బోధన చెప్పిస్తామని ప్రచారం చేసిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు ఆ దిశగా ప్రయత్నం చేయకపోగా ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలో ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు వెంటనే అడహక్ ప్రాతిపదికన ప్లేస్‌మెంట్‌లు ఇచ్చిన తర్వాత వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సహ అధ్యక్షులు రామప్ప, జిల్లా కార్యదర్శి రఘురామయ్య, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నాయుడు, వీరాచారి, కొండప్ప, రాజు, కుళ్లాయప్ప, పవన్, వెంకటప్ప, ప్రజ్ఞా సురేష్, గంగాధర్, శేషప్ప, శ్రీనివాసులు, రఘు, బండయ్య, హెంద్రీ, గౌస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీల పంపిణీ

శింగనమలలో అడ్డుకున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీలు పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు వసతి గృహానికి చేరుకుని నిరసన వ్యక్తం చేయడంతోపాటు చిక్కీల పంపిణీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నాలుగు రోజులు క్రితమే కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థకు గురైన విషయం తెలిసిందే అన్నారు. ఈ ఘటన మరువకముందే బిసి వసతిగృహంలో కాలం చెల్లిన చిక్కీలు పంపిణీ చేశారన్నారు. స్వయానా కలెక్టర్ వచ్చి విద్యార్థినీ, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులతోపాటు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్పందించి పాఠశాలలకు చిక్కీలు సరఫరా చేస్తున్న ఏజెన్సీని రద్దు చేసి నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫుడ్ ఏజెన్సీపై చర్యలు తీసుకునేందుకు సిఫారసు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ నాయకులు సి.వెంకటేష్, ఎం.ఆదినారాయణ, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, కాయల సురేష్‌యాదవ్, బెస్త సాధికారిక కమిటీ పార్లమెంటు అధ్యక్షులు గుమ్మేపల్లి అమర, దైవయత్నం, మెండెం చిన్న ఎర్రిస్వామి, మైనార్టీ కార్యనిర్వహక కార్యదర్శి మహ్మద్ గౌస్, ఐటిడిపి ఛాంపియన్ ముని, నవీన్, కిరణ్‌కుమార్, సర్ఫఫయాజ్, కాయల మసూద్‌వలి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

కేజీబీవీల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా ఉన్న కెజిబివిల్లో సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎపిఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 62 కేజీబీవీల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ, నిర్వహణ, పనితీరు అధ్వానంగా తయారుకావడంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. కనీసం నాణ్యమైన చదువు, భోజనాలు అందించడం లేదన్నారు. జిసిడిఒ, ఎస్ఓలకు కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ పిల్లలపై లేదని ఆరోపించారు. కుల్లిన కాయగూరలు, అధ్వాన్నమైన వసతి, చాలీచాలని భోజనాలు, గడువు ముగిసిన సరుకుల సరఫరా వల్ల విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులు ఉండటం వల్లే జిల్లాలోని యాడికి, గుత్తి, గుంతకల్లు, రామగిరి, శింగనమల కెజిబివిల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా తక్షణం స్పందించి కెజిబివిల్లో సమస్యలు పరిష్కరించడంతోపాటు అర్హత లేని జిసిడిఒని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శింగనమల కేజీబీవీలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ శింగనమల్లో జరిగిన సంఘటనకు సంబంధించి ఫుడ్ శాంపిల్స్ ల్యాబ్ పంపించామని, రిపోర్టు వచ్చిన వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలోని కేజీబీవీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎఫ్ నాయకులు సురేష్, రవిచరణ్, కమల్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపిఎస్ఎఫ్ నాయకులు



సభలో మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న

ఎస్సీ సాధన కోసం ఐక్య ఉద్యమం

రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న

ప్రజాశక్తి-గుంతకల్లు

రజక సామాజిక వర్గాన్ని ఎస్సీ జాబితాలోకి చేర్చడానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న పిలుపునిచ్చారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఎపి రజక సంఘం రాష్ట్ర కన్వీనర్, గుంతకల్లు మార్కెట్టు యార్డు మాజీ ఛైర్మన్ జి.దేవేంద్రప్ప నాయకత్వంలో సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ కూడలి నుంచి 60 అడుగుల రోడ్డులోని రాయల్ ఫంక్షన్ హాలుకు చేరుకుని బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. దేశానికి స్వాతంత్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇప్పటికీ రజకులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణచివేతకు గురవుతూనే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు రజకులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. రజకులు అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 4.02 శాతం ఓటర్లు ఉన్న మన రాష్ట్రంలో రజకులకు గుర్తింపు లేదన్నారు. రాష్ట్రంలో ఒక్క ప్రజాప్రతినిధి లేని కారణంగా రజకుల కష్టాలు, బాధలు ప్రభుత్వాలకు చెప్పే గొంతుక లేదన్నారు. కావున ఎస్సీ సాధన కోసం ఐక్య ఉద్యమాలు శరణ్యమన్నారు. జిల్లాకేంద్రంలో జనవరిలో జరిగే భారీ బహిరంగ సభలో పెద్దఎత్తున రజకులు పాల్గొని ప్రభుత్వానికి తమ సత్తా చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల పోరాట సమితి కన్వీనర్లు పెద్దన్న, లింగమయ్య, సుబ్బయ్య, పరమేష్, కమ్మన్న, హనుమన్న, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : అన్నిరంగాల్లో వెనుకబడ్డ రజకులను ప్రభుత్వం ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని వెంకటేశ్వర రజక సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, ఆదెన్న హెచ్చరించారు. సోమవారం రజక సంఘం పోరాట సమితి ఆధ్వర్యంలో గుంతకల్లులో చేపట్టిన బహిరంగ సభకు మండల రజక సంఘం నేతృత్వంలో గుత్తి మండలం నుంచి పెద్దఎత్తున రజకులు వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ రజకులను ఎస్సీల్లో చేరిస్తే విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతేగాకుండా రజకులకు ఆత్మగౌరవానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రజక సంఘం నాయకులు శీనా, సురేష్, హరిబాబు, చౌడప్ప, సూరి, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

వంట ఏజెన్సీలకు మెనూ ధరలను పెంచాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రభుత్వ పాఠశాలల్లోని వంట ఏజెన్సీలకు మెనూ ధరలను పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు సిఐటియు జిల్లా కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్న మధ్యాహ్న భోజన మెనూ ధరలు పెంచాలని, ఏజెన్సీ నిర్వాహకులకు గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో పాత మెనూ రద్దుచేసి కొత్త మెనూను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. పాత మెనూ ప్రకారం పప్పు, పులిహోర, పలావు బాగుండేవన్నారు. అయితే కొత్త మెనూతో కొత్త సమస్యలు వచ్చాయన్నారు. కావున పాతమెనూనే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఓబులేసు, హమాలీ యూనియన్ సంఘం నాయకులు, మండలంలోని మధ్యాహ్న భోజనం పథకం నిర్వహిస్తున్న 40 పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని వినతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్


తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పిస్తున్న బాధిత రైతులు

సాగులో ఉన్న భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని మండలంలోని కోలగానహళ్లి గ్రామానికి చెందిన హరిజన తిప్పన్న, అనబక్క, తిప్పయ్య విన్నవించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 102లో సుమారు 50 సంవత్సరాల నుంచి భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. కావున ప్రస్తుతం నిర్వహిస్తున్న రీసర్వేలో తాము సాగు చేసుకుంటున్న భూమిని తమ పేరుపై ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ సమస్యను పరిష్కరించాలని విఆర్‌ఓను ఆదేశించారు.

ఎంపిపికి సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ


ఎంపిపి పుష్పావతి భీమిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతును పాల్తూరు సర్పంచి బ్యులా రాణి రాజశేఖర్, గాజుల మల్లాపురం కన్వీనర్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఎంపిపి ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులను సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, విడపనకల్ పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, వైసిపి నాయకులు వన్నారెడ్డి, వీరన్న, ఎర్రిస్వామి రెడ్డి, ఓబులప్ప, రామాంజనేయులు, వెంకటేశులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

వికలాంగులకు చేయూతనిస్తే అన్నిరంగాల్లో రాణిస్తారని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విడపనకల్లు మండల కేంద్రంలో మయూరి విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాకాన్ని ఇస్తున్నామన్నారు. అలాగే వికలాంగులు కూడా సకలాంగులతో పోటీ పడి విద్య, వైద్య తదితర రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అలాగే ఆర్డీటీ సంస్థ వికలాంగులకు కల్పవక్షం వంటిదన్నారు. జిల్లావ్యాప్తంగా వికలాంగుల కోసం ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేసి మంచి విద్యతోపాటు వత్తి విద్య కోర్సులను, వ్యక్తిత్వ నైపుణ్యాలను పెంపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ కుమారస్వామి, వైద్యాధికారి శ్రీధర్, మాజీ సర్పంచి కరణం భీమిరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు చిన్ననాయుడు, వికలాంగుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


వికలాంగులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి పుష్పావతి

నేరాలు ఘోరాలు

ఎడ్లబండిని ఢీకొన్న బొలేరో.. ఎద్దు మృతి


ప్రమాదంలో మృతిచెందిన ఎద్దు

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలుపల్లి గ్రామ సమీపంలో పెన్నానది బ్రిడ్జి వద్ద ఎడ్ల బండిని బొలేరో వాహనం ఢీకొనడంతో ఎద్దు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాలుపల్లి గ్రామానికి చెందిన హరిజన పెద్దన్న అలియాస్ భవానీ తనకున్న బోరు బావి కింద పొలంలో వేరుశెనగ సాగు చేసేందుకు ఎడ్లబండిలో వెళ్తుండగా కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి టమోటా లోడుతో వెళ్తున్న బొలెరో వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. రైతు పెద్దన్నకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పట్టుబడిన బియ్యం

గుత్తి : మండలంలోని గాజులపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. గాజులపల్లి గ్రామ శివారులో ఉన్న ఆవదూత చంద్రమ్మ అవ్వ ఆలయం వద్ద రేషన్ బియ్యం నిల్వ ఉన్న సమాచారం తెలుసుకున్న అధికారులు దాడులు నిర్వహించి 110 బస్తాలు (61 క్వింటాళ్లు) రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ కళాశాలను సందర్శించిన 'మెట్టు'


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత కళాశాల భవనం పైభాగాన అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కళాశాలలో సౌకర్యాల కల్పనకు తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు వాలంటీర్ల పోస్టులకు సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 33 మంది దరఖాస్తు చేసుకోగా 20 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

ఆహారానికి నేల మూలధారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

గుత్తి : సమస్త జీవరాశులు, మానవాళి మనుగడకి ముఖ్యమైన ఆహారం నేల అని శాస్త్రవేత్తలు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని కరిడికొండ గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వన్నెదొడ్డి, బాచుపల్లి గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త నటరాజ్ మాట్లాడుతూ రైతులు వీలైనంత వరకు సంప్రదాయ పంటలనే సాగు చేయాలని సూచించారు. రసాయనాలు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలు వేయకుండా భూములను సంరక్షించుకోవాలన్నారు. భూసార పరీక్షలకు ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటరమణ, రాధాకుమారి, శ్రీనివాసులు, ఎడిఎ నారాయణనాయక్, ఎఇఒ కృష్ణభగవాన్, విఎఎ అజయ్, ఉప సర్పంచి ఆనందరామ్, కార్యదర్శి సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కళ్యాణదుర్గం : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని స్పోర్ట్స్ జిల్లా డెవలప్‌మెంట్ కోచ్ వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో హ్యాండ్‌బాల్ లీగల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కావున క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం హ్యాండ్‌బాల్ విన్నర్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మార్తమ్మ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయం ఫణీంద్ర, పీడీ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, కిషోర్‌చౌదరి, షేక్షావలి, అర్చనకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన సిఎం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం : వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఉచిత సంక్షేమ పథకాల వల్ల సిఎం జగన్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని గరూడపురం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రం ఆర్థిక వనరులు, అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా శూన్యంగా మారాయన్నారు. ఉచిత సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపై అనేక భారాలు మోపుతున్నారన్నారు. కావున ప్రజలు రానున్న రోజుల్లో ఓటు ద్వారా వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతురాయచౌదరి